ప్రజాశక్తి
శుక్రవారం 20 డిసెంబర్ 2024
5
శ్రీ సత్యసాయి






ఐసిడిఎస్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

ఐసిడిఎస్ అధికారులకు కలెక్టర్ హెచ్చరిక

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ అన్ని అంశాలలో వెనుకబడిందని, పనిలో మార్పు రాకుంటే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ టిఎస్.చేతన్ హెచ్చరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఐసిడిఎస్ ప్రాజెక్టుల పనితీరుపై ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీ సుధా వరలక్ష్మి సంబంధిత అధికారులతో కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష జరిగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంగనవాడీ కేంద్రాలకు సకాలంలో గుడ్లు పంపిణీ జరగాలన్నారు. కేంద్రాలలో మరుగుదొడ్లు తాగునీరు సౌకర్యం పనులు త్వరగతిన పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ పంచాయతీరాజ్ శాఖల అధికారుల సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు అప్పగించిన పనులపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. బాల్యవివాహాలు అరికట్టడానికి గ్రామస్థాయిలో విస్తతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 154 అంగన్వాడీ కేంద్రాలలో ఇంకుడు గుంతలు ఇతర పనులు పూర్తి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నపిల్లల కోసం ప్రత్యేక ఆధార్ నమోదు చేయించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కొన్ని ప్రాంతాలలో చిన్నచిన్న సమస్యలు కూడా సిడిపిఒలు పరిష్కరించలేకపోతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఈ పద్ధతి పూర్తిగా మారాలన్నారు. సమావేశంలో గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, ఎస్‌డిసి సూర్యనారాయణ రెడ్డి, డిసిఒ జగదీష్, డిసిపిఒ మహేష్ పాల్గొన్నారు.



కార్మికుల భద్రత గాలికి...!

- పరిశ్రమల్లో ప్రాణాలతో చెలగాటం
- ప్రమాద పరిస్థితుల్లో పనులు
- సొంతలాభానికి పరిశ్రమల యాజమాన్యాలు పరిమితం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న కార్మికులు ఎప్పుడు ఏ ప్రమాదం బారిన పడుతారో తెలియని పరిస్థితులు ఉన్నాయి. యాజమాన్యాలు కనీస అప్రమత్తత చర్యలు తీసుకోకుండానే అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో పనులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. పరిశ్రమల్లో ప్రమాద ఘటన జరిగి విషయం బయటకొస్తేనే అధికారుల హడావుడి కన్పిస్తోంది.. లేకుంటే చర్యలు నామ మాత్రంగానే ఉంటాయన్న విమర్శలూ ఉన్నాయి. జిల్లా సేఫ్టీ కమిటీలున్నప్పటికీ అవి మొక్కుబడి తనిఖీలతోనే మమ అనిపించేస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

ప్రమాద కారణాలు వెలుగులోకొచ్చేనా ..?

అనంతపురం జిల్లా యాడికి మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఆదానికి సంబంధించిన అంబుజా సిమెంటు పరిశ్రమలో ప్రమాదం చోటు చేసుకుంది. పెన్నా సిమెంటుగానున్న ఈ పరిశ్రమను ఇటీవలే ఆదానికి సంబంధించిన అంబుజా సిమెంట్ టేక్‌ఓవర్ చేసింది. ఈ పరిశ్రమలో మరమ్మతుల కోసం షట్‌డౌన్ చేసినట్టు చెబుతున్నా.. షట్‌డౌన్ చేసిన పరిశ్రమలో అంత పెద్దఎత్తున మంటలు ఏ విధంగా ఉన్నాయన్న సందేహాలున్నాయి. ప్లాంట్ రన్నింగులో ఉండగానే కార్మికులతో ప్రమాద స్థలాల్లో పనిచేయించారన్న ఆరోపణలున్నాయి. దీనిపై సమగ్రమైన విచారణకు ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ ఆదేశించారు. సేఫ్టీ కమిటీ పరిశీలించి అందులో ప్రమాదానికిగల కారణల్లో వాస్తవాలు ఏ మేరకు బయటకొస్తాయన్నది చూడాల్సి ఉంది.



ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ తాడిపత్రి ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

పరిశ్రమల్లో అనేక ఘటనలు..

జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో వెలుగులోకి వస్తున్నవి కొన్నిమాత్రమే. 2018లో ఆర్జాస్ స్టీల్ పరిశ్రమలో గ్యాస్ లీకైన ఘటనలో ఆరుగురు కార్మికులు మృతి చెందారు. ఇది జరిగిన మరుసటి ఏడాదే 2019లో అదే పరిశ్రమలో ఇనుప హుక్కు పైనుంచి పడి కార్మికుడి గొంతు తెగిపడి మృతి చెందాడు. ఈ ఘటనలో మల్లేష్ అనే కార్మికుడి చనిపోయాడు. 2021లో హిందూపురంలో ఒక ఫార్మ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందాడు. విడపనకల్లులో యాపిల్ పరిశ్రమ ఎస్ఎల్‌వి పరిశ్రమలోనూ ప్రమాదాలు జరిగాయి. పెనుకొండ వద్ద కియా పరిశ్రమలో ఒక కార్మికుడు మృతి చెందాడు. కాని యాజమాన్యం అది ప్రమాదం కాదని సహజమరణమని చెబుతోంది. అనంతపురం సమీపంలోని కర్నూరం ఫ్యాక్టరీలోనూ ఇటీవల ప్రమాదం చోటు చేసుకుంది. ఇవి కాకుండా ఇప్పుడు ప్రమాదం జరిగిన పెన్నా పరిశ్రమలో గతంలో రెండుసార్లు బాయిలర్ వద్దనే ప్రమాదం జరిగింది. ఇలా తరచూ పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నా నివారణకు తీసుకుంటున్న చర్యలు మొక్కుబడిగా ఉంటున్నాయి.

నిరంతరం తనిఖీలు నిర్వహించాలి



ప్రమాదాలపై తరచూ జిల్లా సేఫ్టీ కమిటీ తనిఖీలు నిర్వహించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి. ఇటీవలి కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది దాక పరిశ్రమల్లో కార్మికులు చనిపోయారు. కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ప్రస్తుతం అంబుజా సిమెంట్ పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనపై న్యాయపరమైన విచారణ చేపట్టాలి. మృతి చెందిన కార్మికుని కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలి. అతని భార్యకు శాశ్వత ఉద్యోగం, కుమారుడి సంరక్షణ నిమిత్తం నెలకు రూ.20 వేలు ఇవ్వాలన్నారు. క్షతగాత్రులకు తక్షణ సహాయం కింద రూ.20 లక్షలు ఇవ్వాలి.

ఓబులు, సిఐటియు రాష్ట్ర నాయకులు

భూముల మార్కెట్ విలువ ప్రక్రియ వేగవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్



సమావేశంలో పాల్గొన్న జేసీ, అధికారులు

భూముల మార్కెట్ విలువలను జాగ్రత్తగా పరిశీలించి ఈనెల 27 నాటికి ప్రక్రియను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో సంబంధిత అధికారుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ ఐజి జారీ చేసిన మార్కెట్ విలువ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ విజయలక్ష్మి, జిల్లా రిజిస్టర్ కృష్ణకుమారి, నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి తో పాటు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఇటీవల కాలంలో వెలువడిన ఉత్తర్వుల మేరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల భూముల స్థలాలు మార్కెట్ విలువలు పెంపుదల పూర్తి చేయాలన్నారు. ప్రజలకు తెలిసే విధంగా మార్కెట్ ధరలు రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో, వెబ్ సైట్ లోను నోటీసు బోర్డులలోను ప్రదర్శించాలన్నారు. జనవరి ఒకటి నుంచి పెంచబడిన ధరలు అమలులోకి వస్తాయన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

◆ పలు భవనాలకు నోటీసులు జారీ ◆ డబ్బులిచ్చి నష్టపోయాం : గృహ నిర్మాణదారులు



పెనుకొండలో అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాన్ని ఆపిస్తున్న నగర పంచాయతీ రెవెన్యూ, ప్లానింగ్ సిబ్బంది

"ప్రజాశక్తి" కథనానికి స్పందన

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై 'కట్ట'డాలు..! అనే శీర్షికన గురువారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి నగర పంచాయతీ అధికారులు స్పందించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది గురువారం ఉదయాన్నే పట్టణంలో పర్యటించి అక్రమ నిర్మాణ పనులను ఆపించారు. వారికి నోటీసులు జారీ చేసి నిబంధనల మేరకు ప్లాన్ అప్రూవల్ తీసుకోవాలని ఆదేశించారు. మడకశిర రోడ్డులో నిర్మిస్తున్న గృహ నిర్మాణానికి సంబంధించి అనుమతుల కోసం ఓ మాజీ ప్రజాప్రతినిధికి డబ్బు ఇచ్చామని, ఇలా అర్థాంతరంగా నిర్మాణ పనులు ఆపితే తమ పరిస్థితి ఏమిటంటూ గృహ యజమాని అధికారులను ప్రశ్నించారు. అనధికారికంగా ఇచ్చిన డబ్బుకు తమకు ఎలాంటి సంబంధం లేదని, నిబంధన మేరకు ప్లాన్ అప్రూవల్ తీసుకున్న తర్వాతే నిర్మాణం చేపట్టాలని ఆయనకు వివరించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'చూసీచూడనట్లు వ్యవహరించాలి'
టౌన్ ప్లానింగ్ సిబ్బందితో ఓ మాజీ ప్రజాప్రతినిధి

'గృహ యజమాని తనకు కావాల్సిన వ్యక్తి.. ఇలాంటివి పట్టించుకోకుండా చూసీచూడనట్లు ఉండాలి.. నిర్మాణాన్ని అడ్డుకోవద్దు.' అంటూ ఓ మాజీ ప్రజా ప్రతినిధి టౌన్ ప్లానింగ్ సిబ్బందితో బేరానికి వచ్చినట్ల సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా జరిగే నిర్మాణాల విషయాల్లో తాము ఏమీ చేయలేమని అధికారులు ఆ ప్రజాప్రతినిధికి చెప్పినట్లు తెలుస్తోంది.

డబ్బు పోయా.. నిర్మాణం ఆగిందంటూ యజమానులు ఆందోళన

గృహ నిర్మాణం కోసం ఇప్పటికే డబ్బులు ఇచ్చాం. ఇప్పుడు అధికారులు ఆపమంటున్నారు. డబ్బు పోయి గృహ నిర్మాణం ఆగిపోయిందంటూ నిర్మాణదారులు లబోదిబోమంటున్నారు. నగర పంచాయతీ సిబ్బంది నిర్మాణాలను ఆపాలని హెచ్చరించిన నేపథ్యంలో అక్రమ గృహ నిర్మాణ యజమానులకు భయం పుట్టుకుంది. మధ్యవర్తులను నమ్మి డబ్బు పోగొట్టుకున్నామని వారు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకుని నిర్మాణం చేపట్టి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చి ఉండేది కాదని వారు చర్చించుకుంటున్నారు.

ప్రభుత్వంపై పోరుకు సిద్ధమవుదాం

ఉమ్మడి జిల్లా వైసిపి నేతలతో వైఎస్.జగన్



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి అనంతపురం జిల్లా వైసిపి నాయకులు



ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై పోరుకు సిద్ధం అవ్వాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో జగన్మోహన్‌రెడ్డి గురువారం ఉదయం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులకు భవిష్యత్తు కార్యచరణపై దిశానిర్ధేశం చేస్తూ మాట్లాడారు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వం విజన్ పేరుతో మేనిఫెస్టోను ఎగ్గొట్టే ప్రణాళిక చేస్తోందన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు అటెకెక్కాయని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెడుతూ రెడ్ బుక్ రాజ్యాంగం నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా చంద్రబాబు నాడు అబద్దాలు, మోసాలతో పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల మేనిఫోస్టో, సూపర్‌సిక్స్‌ను అమలు చేయలేక చంద్రబాబు చెప్పిన మాటలు మోసాలై ప్రజలకు కన్పిస్తున్నాయి. ప్రజాస్వామ్య బద్దంగా జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను అపహాస్యం చేశారన్నారు. ఆరు నెలల్లో 3.14 లక్షల పింఛన్లను ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. విద్యుత్ భారాలను ప్రజలపై మోపారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ వైసిపి శ్రేణులు పోరుబాటకు సిద్ధం కావాలని జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతికార్యకర్త సోషల్ మీడియా సైనికుడు కావాలన్నారు. ప్రతిపక్షంలో కష్టాలు, కేసులు సహజమని వాటిని ఎదిరించి ముందుకు సాగాలన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, వైసిపి, జగన్ అండగా ఉంటారని భరోసానిచ్చారు. జనవరి నుంచి తాను జిల్లాల పర్యటన చేస్తున్నట్లు జగన్మోహన్‌రెడ్డి తెలియజేశారు. 'కార్యకర్తలతో జగనన్న పార్టీ బలోపేతానికి దిశ నిర్దేశం' పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాని తెలిపారు. ఈ లోగా పార్టీ సంస్థాగత నిర్మాణాలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఉషశ్రీచరణ్, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎంపీలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, శంకరనారాయణ, నియోజకవర్గ సమన్వయ కర్తలు మెట్టు గోవిందరెడ్డి, ఆలూరు సాంబశివారెడ్డితో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వైసిపి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతి బాధాకరం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కదిరి అర్బన్

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సిద్దయ్య శెట్టి పరీక్ష పేపర్లు పాఠశాలకు తీసుకు వెళ్తూ ప్రమాదానికి గురై మృతిచెందడం బాధాకరమని యుటిఎఫ్ నాయకులు అన్నారు. జిల్లా యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో కదిరి పట్టణంలో మండల విద్యా అధికారి కార్యాలయం వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఆయన మతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి, శెట్టిపి జయ చంద్రారెడ్డి, సుధాకర్, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సుబ్బా రెడ్డి మాట్లాడుతూ తలుపులపల్లి జెడ్పిహెచ్ఎస్‌లో బయలాజికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సిద్దయ్య శెట్టి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడానికి కారణం ప్రభుత్వ తప్పిదమేనని అన్నారు. పేపర్ లీక్ కాకుండా చూసుకోవడం పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రభుత్వం భవిష్యత్‌లో పరీక్ష పేపర్లను పాఠశాలకు సరఫరా చేసేవిధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు నారాయణ స్వామి, అడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున, ఆజాంబాషా, సిపిఎస్ కన్వీనర్ సునీల్ కుమార్, రవివర్ధన్ రెడ్డి, నజీర్, మనోహర్, బాలాజీ నాయక్, సంతోష్, రమణ నాయక్, లక్ష్మీప్రసాద్, ఖాదర్‌బాషా, నాగరాజు నాయక్, బ్రహ్మేంద్ర, హనీఫ్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు : పల్లె

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తన తాడేపల్లి ప్యాలెస్ కూర్చొని రైతు సంక్షేమం గురించి రైతు కష్టాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. రైతు పెట్టుబడి సాయం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై జగన్ గురువారం విజయవాడలోని తాడేపల్లి ప్యాలెస్ లో కూర్చొని ప్రభుత్వాన్ని విమర్శించడంపై మాజీ మంత్రి ఖండించారు. రైతుల సంక్షేమం గురించి జగన్ మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. గత ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో ఒక మూరేడు పొడవు డ్రిప్పు కూడా ఇవ్వలేదన్నారు. తన ఐదేళ్ల పాలనలో్ రైతుల కష్టాల గానీ సంక్షేమం గురించి జగన్ పట్టించుకోలేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 13.52 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు తగ్గిందన్నారు. ప్రజల దగ్గరకు వస్తే ఎక్కడ సొంత కార్యకర్తలే తన పని పడతారనే భయంతోనే జగన్ తాడేపల్లి ప్యాలెస్ వదిలి రాలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 15 రోజుల్లోపు వారి డబ్బులు చెల్లించే ఏర్పాటు కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. జగన్ అసమర్ధపాలనతో గ్రామాల్లో కనీసం సిసి రోడ్లు, విద్యుత్ దీపాలు కూడా వేయులేకపోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాలకు వెళ్లి స్వయంగా పరిశీలించాలని ప్రజలను అడిగి తెలుసుకోవాలని జగన్‌కు సూచించారు.

23న 104 ఉద్యోగులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న విధులను బహిష్కరించనున్నట్లు 104 సిబ్బంది తెలిపారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే జనవరి 5 నుంచి సమ్మె చేపడతామని ప్రభుత్వానికి 104 యూనియన్ ఆధ్వర్యంలో నోటీసులను అందజేశామన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నవంబర్ 1వ తేదీ నుండి వైద్య సేవలకు అంతరాయం కలగకుండా శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేస్తూ వచ్చామన్నారు. అయినా ప్రభుత్వం, అరబిందో యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఈనెల 23న ఒకరోజు విధులను బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. అప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం తమ న్యాయమైన సమస్యలపై చర్చలకు పిలిచి పరిష్కంచకపోతే జనవరి 5 తర్వాత సమ్మెతో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు నరసింహులు, జయచంద్ర, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి : సిపిఎం

ప్రజాశక్తి-హిందూపురం


హిందూపురం ప్రాంతంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇంటిని నిర్మించి ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎం.వి.రమణ మాట్లాడుతూ, కొట్నూరు పొలంలోనిభూమిలో గత సంవత్సరం క్రితం గుడిసెలు వేసుకుని, అక్కడే నివాసం ఉంటున్నారని, ప్రభుత్వ ఆయా నిరుపేదలకు వెంటనే ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేయాలని కోరారు. దాదాపు 447 మంది లబ్ధిదారులు ఆ స్థలాలలో గుడిసెలు వేసుకొని జీవనం చేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు గుడిసెలు వేసుకున్న స్థలంలోనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాల పోరాట కమిటీ, సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యురాలు గంగమ్మ, సానియా, హసీనా, ఆది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పల్లెనిద్ర

ప్రజాశక్తి- కదిరి టౌన్

కదిరి రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ పరిధిలోని చిప్పల మడుగు గ్రామంలో గురువారం పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా సిఐ ప్రజలతో మాట్లాడారు. గ్రామాలలో చిన్న చిన్న సమస్యలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలో రౌడీ షీటర్లు, పాత కేసులలో నేరస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

భూములపై పేదలకు హక్కులు కల్పించాలి: సిపిఎం


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని పందిపర్తి పొలం సర్వేనెంబర్ 384 లో ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం మండల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం సిపిఎం మండల కమిటీ సభ్యులు కొండా వెంకటేష్ ఆధ్వర్యంలో తాసిల్దార్ రెడ్డి శేఖర్‌కి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య మాట్లాడుతూ దశాబ్ద కాలంగా పేదలు ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నారన్నారు. పంటసాగుకు పనికి రాని భూములను కూడా వ్యవసాయయోగ్యమైన సారవంతమైన భూములుగా మార్చడానికి కుటుంబాలు మొత్తం సంవత్సరాల తరబడి పని చేశారన్నారు. సాగు హద్దులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసిన పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడైనా పేదల పట్ల కనకరించి న్యాయం చేయాలని తహశీల్దార్‌నుకోరారు. అనంతరం గుడిపల్లి గ్రామానికి చెందిన పేద రైతులతో కలిసి వ్యక్తిగత అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు శీనప్ప, ఆటో చంద్ర, స్రవంతి, రామాంజినమ్మ, లక్ష్మి దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపకారాగారంలో పరిశుభ్రత పాటించాలి


హిందూపురం సబ్‌జైలులో మాట్లాడుతున్న న్యాయమూర్తి


ధర్మవరం సబ్‌జైలులో పోలీసులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి-హిందూపురం

ఉపకారాగారంలో పరిశుభ్రత పాటించడంతోపాటు నిందితులకు రుచికరమైన ఆహార అందించాలని జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్న నిందితుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య చికిత్సలు చేయించాలని ఆయన తెలిపారు. గురువారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 18 సంవత్సరాల లోపు ఎవరైనా నిందితుల ఉంటే ఉపకారాగారంలో ఉంచుకోరాదని వెంటనే ఆ విషయాన్ని తెలియజేసి జువైనల్ హోంకు పంపే ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే 60 ఏళ్ల దాటిన నిందితులు ఉన్న వెంటనే సమాచారం ఇవ్వాలని ఉప కారాగార అధికారి హనుమన్నకు సూచించారు ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నవేరా, సంతోషి కుమారి, పార్వతి, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, శారద, పారా లీగల్ వాలంటీర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సబ్ జైల్లో ఉన్న ఖైదీల అందరూ కూడా సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. శివప్రసాద్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం ధర్మవరం సబ్‌జైలును తనిఖీ చేశారు. ఖైదీలతో సమావేశాన్ని నిర్వహించి వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఖైదీలకు లాయర్లు ఉన్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా 70 సంవత్సరాలు పైబడిన వయసుగల వారు కూడా ఉన్నారా అని ఆరా తీశారు. అనారోగ్య సమస్యలు ఏమైనా ఉంటే, సబ్ జైల్ సూపరింటెండెంట్ ద్వారా డాక్టర్‌ను పిలిపించుకొని వైద్య చికిత్సలు పొందాలని సూచించారు. ఖైదీల గదులు, వంటగది, సబ్ జైలు పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ బ్రహ్మారెడ్డి, న్యాయవాదులు బాలసుందరి, మోహన్ ప్రసాద్, ప్యారా లీగల్ వాలంటరీ షామీర్‌బాషా పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి- చిలమత్తూరు

2023-24 సంవత్సరం లో జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన మండల కేంద్రంలో సామాజిక తనిఖీ ప్రజావేదికనుగురువారం నిర్వహించారు. ఈ మేరకు సామాజిక తనిఖీలలో బాగంగా టేకులోడు లో 40 క్యూబిక్ మీటర్ల పని చేస్తే 20 క్యూబిక్ మీటర్లుగా నమోదు చేయడంతో కూలీలకు అన్యాయం జరిగినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. అలాగే రైతులకు ఇచ్చిన మొక్కలలో చాల వరకు దెబ్బతిన్నాయని నాసీరకం మొక్కల నాటటం వల్లే ఇలా జరిగినట్లు గుర్తించామని చెప్పారు.కొన్ని చోట్ల మస్టర్లలో కూలీల సంతకాలు లేక పోయిన బిల్లులు చేసినట్లు గుర్తించామన్నారు. చెరువుల్లో చేసిన పనులు నీరు రావడంతో గుర్తించలేక పోయామన్ని, పొలాల్లో ట్రెంచ్ కొట్టడంలో పొడవు వెడల్పుల తేడాలు గుర్తించామని సోషియల్ ఆడిట్ టీం అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నిపై 59,909 రూపాయలు రికవరి చెల్లించాలని అదికారులు సూచించారు. ఈ కార్యక్రమం లో ప్రొసీడింగ్ ఆఫీసర్ విజయేంద్ర ప్రసాద్, ఎమ్ఇ శివశంకర్, ఎస్ ఆర్‌పి ఆవులయ్య, ఎవిఒ నాగేశ్వర్ రావు, ఎపిఒ అప్పిస్వామి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు రాయితీ

నల్లచెరువు : ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యాన శాఖ అధికారి లావణ్య తెలిపారు. పండ్ల తోటల రైతులు కోత అనంతరం క్లీనింగ్, గ్రేడింగ్ మరియి ప్యాకింగ్ చేసుకోవడానికి ప్యాక్ హౌస్ నిర్మాణానికి గరిష్టంగా 2 లక్షల రూపాయలు, నీటి వనరుల పథకం ద్వారా ఫారం పాండ్ నిర్మాణానికి గరిష్టంగా 75వేల రూపాయలు, కమ్యూనిటీ ఫారం పాండ్ నిర్మాణానికి గరిష్టంగా 20 లక్షల రూపాయల రాయితీ అందిస్తారని చెప్పారు. నాణ్యమైన ఉద్యాన పంటలు పండించడానికి పాలిహౌస్ నిర్మాణానికి గరిష్టంగా ఎకరాకి రూ. 16.88 లక్షలు, షేడ్ నెట్ నిర్మాణానికి రూ. 14.20 లక్షలు, కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి వ్యక్తిగత రైతులకు 40శాతం రాయితీతో (గరిష్టంగా రూ.6 లక్షలు), సోలార్ కోల్డ్ రూమ్ నిర్మాణానికి వ్యక్తిగత రైతులకు 35శాతం (గరిష్టంగా రూ. 4.37 లక్షలు), శీతల గిడ్డండులకు 35శాతం రాయితీని ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందజేస్తుందని తెలిపారు. అంతేకాకుండా కొత్తగా పెట్టిన పండ్ల తోటలకు(మామిడి, దానిమ్మ, చీని, నిమ్మ, డ్రాగంఫ్రూట్, సీతాఫలం, జామ, అంజూరా) మూడేళ్ళ వరకు నిర్వహణ రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు సమీప రైతు సేవ కేంద్రం, ఉద్యాన శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

యుటిఎఫ్ ఎస్ఎస్‌సి మోడల్ పేపర్లు ఆవిష్కరణ


రొద్దంలో మోడల్‌పేపర్లు చూపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - మడకశిర

మండలంలోని గౌడనహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యుటిఎఫ్ రూపొందించిన ఎస్ఎస్‌సి మోడల్‌పేపర్లను ఆవిష్కరించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు మాలింగప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు బూతన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర చేతుల మీదుగా వీటిని ఆవిష్కరించారు. పదోతరగతి విద్యార్థులు ఈ మోడల్‌పేపర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు నరసింహమూర్తి, బి నరసింహమూర్తి, సి నరసింహమూర్తి, ఎర్రమల, ఫమీద, కవిత, అనురాధ, సి.అనురాధ విద్యార్థులు పాల్గొన్నారు.

రొద్దం : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించే ఎస్ఎస్‌సి మోడల్ పేపర్లను గురువారం మండలంలోని పెద్దమంతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న 46 మంది విద్యార్థులకు అందజేశారు. వీటిని మాజీ ఎంపీపీ నరహరిఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత, మాజీ ఎంపీపీ నరహరి మాట్లాడుతూ విద్యార్థులు యూ టిఎఫ్ మోడల్ పేపర్లను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు నరేష్ కుమార్, సీనియర్ నాయకులు నారాయణ స్వామి, మండల అధ్యక్షులు సానిపల్లి గంగాధర్, రమేష్ నాయకులు సత్యమయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాగి పంటసాగు విస్తీర్ణాన్ని పెంచండి : జేసీ


గుడిబండలో మాట్లాడుతున్న జేసీ

ప్రజాశక్తి - గుడిబండ

మండల వ్యాప్తంగా రాగిపంట సాగు విస్తీర్ణతను పెంచి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జెసి అభిషేక్ కుమార్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని మోరుబాగల్ గ్రామంలో గురువారం రాగి సాగు విస్తీర్ణతపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎడిఎస్ఆర్ శ్రీకృష్ణ మీనన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాగి పంట సాగు చేసిన రైతుల పంటను ప్రభుత్వమే సివిల్ సప్లై ద్వారా కొనుగోలు చేస్తుందని చెప్పారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో రాగి పంట సాగు పై అవగాహన కల్పించి రాగి సాగు విస్తీర్ణత శాతాన్ని పెంచేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కరుణాకర్, డిటి రాంభూపాల్ రెడ్డి, వ్యవసాయ అధికారి వీర నరేష్, ఏపీ మాస్ ఎన్జీవో సంస్థ గోపాల్‌చ జడ్పీఎన్ఎఫ్ డివిజనల్ యాంకర్ రమేష్, స్థానిక సర్పంచి తిప్పేస్వామి, సాగునీటి సంఘం అధ్యక్షులు హనుమంతరాయప్ప, సివిల్ సప్లయ్ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

పరిగి :మండలంలోని జాతీయ హైవే సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఏసీఎన్జీ ప్రైవేట్ లిమిటెడ్ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు భూ రికార్డులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ గురువారం పరిశీలించారు. ఇటీవలే యాజమాన్యం సిఎన్జి గ్యాస్ కేంద్రం ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోగా తహశీల్దార్ హసీనాసుల్తానాతో కలసి జెసి ఏసియన్ ఫిల్లింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. గ్యాస్ పంపిణీ, పైప్ లైన్ వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే జాగ్రత్తలపై యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అనంతరం గ్యాస్ కేంద్రానికి కేటాయించిన భూ రికార్డులను పరిశీలించారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు


మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి మడకశిర

మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్ని మంచినీటి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజాసమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో మున్సిపాలిటీ సమస్యలపై మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు మున్సిపాలిటీలోని 60మంది ఉద్యోగులతో కలిసి ఉదయం 7:30 నుంచి 12గంటల వరకు పట్టణంలోని వార్డుల్లో పర్యటించనున్నట్లు చెప్పారు. ప్రణాళికాబద్ధంగా ప్రజాసమస్యలను పరిష్కరించడానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలోని 20 వార్డుల్లోనూ నీటి సమస్య ఉందని ప్రజలు చెబుతున్నారని 15రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతోందన్న ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. పట్టణంలో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదని, వీధులు శుభ్రంగా ఉండడంలేదనే ఫిర్యాదులు ప్రజల నుండి వస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు సకాలంలో స్పందించకుంటే శాఖాపరమైన చర్యలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మున్సిపల్ ఇంజనీర్ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీలో ఎలాంటి వివక్షకు తావులేదు : టిటిడి దేవస్థానాన్ని ఉద్దేశించి తెలంగాణ మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు కేవలం బీఆర్ఎస్ ఉనికి కాపాడుకునేందుకే తప్ప మరొకటి కాదని మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎంఎస్.రాజు అన్నారు. టీటీడీని ఉద్దేశించి శ్రీనివాస్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. శ్రీనివాస్ గౌడ్ తమ పార్టీ ఉనికి కోసం ఆవేశంలో దేవుడి వద్ద రెండు రాష్ట్రాల ప్రజల, వెంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా రాజకీయాలు మాట్లాడడం సరికాదని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ప్రమాద బాధితుడికి పరామర్శ : మండల పరిధిలోని పాపసానిపల్లి గ్రామానికి చెందిన కిష్టప్ప అతని కుమారుడు రోడ్డు ప్రమాదం గాయపడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కిష్టప్ప కుమారుడిని గురువారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కళ్ళు మరి సర్పంచి నాగరాజు, టిడిపి నాయకుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సెప్టిక్ ట్యాంకులో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి-పెనుకొండ

బాబయ్య స్వామి ఉరుసులో మూడు రోజుల క్రితం అదృశ్యమైన బాలుడు సెప్టిక్ ట్యాంకులో శవమై కనిపించాడు. ఇందుకు సంబంధించిన ఎస్ఐ వెంకటేశ్వర్లు అందించిన వివరాల మేరకు కర్నాటక రాష్ట్రం చిత్రదుర్గ్‌కు చెందిన జాఫర్ తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి బాబయ్య స్వామి ఉరుసు ఉత్సవాలకు వచ్చారు. మంగళవారం రోజు దర్గా వెనుక వైపు ఆడుకుంటున్న నాలుగు సంవత్సరాల మహమ్మద్ సల్మాన్ కనిపించకుండా పోయాడని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బాలుని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. టౌన్‌లో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించినా ఎక్కడ బాలుడి ఆచూకీ లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం దర్గా వెనుక వైపు ఉన్న సెప్టిక్ ట్యాంక్ గుంతలో బాలుడి శవం పైకి తేలింది. విషయం తెలుసుకున్న పోలీసులు బాలుడి మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈసందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి బాలుడి మరణానికి కారణమైన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తామని అన్నారు.ఉరుసుకు వేలాదిమంది భక్తులు వస్తారని అలాంటి సందర్భంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. కాలనీకి చెందిన కిరణ్(32) కూలి మగ్గం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. యువకుడు గత కొంత కాలం నుండి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు వివాహం ఇంకా కాలేదని మనస్థాపానికి గురై ధర్మవరం, నాగసముద్రం రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

పోక్సో కేసులో మూడేళ్లు జైలు

ప్రజాశక్తి:-చిలమత్తూరు

పోక్సో కేసులో చిలమత్తూరు మండలానికి చెందిన యువకుడు మధు(25)కి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమాన విధిస్తూ అనంతపురం పోక్సో స్పెషల్ జడ్జి రాజ్యలక్ష్మి తీర్పును వెలువరించారు. ప్రభుత్వం బాధిత యువతికి 50 వేలు రూపాయలు చెల్లించాలని తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్షపడేలా సాక్షుల్ని విచారించడానికి సహకరించిన పిపి విద్యాపతి, చిలమత్తూరు హెడ్ కానిస్టేబుల్ గురుస్వామినిఎస్పీ రత్న అభినందించినట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

యువతి అదృశ్యం... కేసు నమోదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని రాజీవ్ గాంధీ నగర్ లో నివాసమున్న మొరుపూరి పరిమళ కుమార్తె మొరుపురి మేఘన అదృశ్యం అయినట్లు యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ చెప్పారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాపాగ్ని పరివాహక ప్రాంతాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

పాపాగ్ని నది పరివాహక ప్రాంతాల అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేయాలని డిఆర్‌డిఎ పీడీ సరసయ్య సూచించారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని సారగుండ్లపల్లి గ్రామ సమీపంలో సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి హాజరైన పీడీ మాట్లాడుతూ పాపాగ్ని నది కర్నాటక రాష్ట్రంలోని కలవ కండ్లలో పుట్టి పెడబల్లి జలాశయం గుండా చిత్రావతి నదిలోకి కలుస్తుందన్నారు. దీని పొడవు 108 కిలోమీటర్లు ఉంటుందన్నారు. ఈ పాపాగ్ని నది వెంబడి ఉన్న గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రైతులు ఐకమత్యంతో మెలగాలని సూచించారు. బోరు బావులలో నీటి నిల్వలు లేనప్పుడు పాపాగ్ని నది నీటిని వినియోగించుకుని పంటలు పండించుకున్నారని చెప్పారు. ఫారెస్ట్ అధికారి రామచంద్రా నాయక్ మాట్లాడుతూ అడవికి నిప్పు మూగజీవాలకు ముప్పు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బలిజపల్లి సర్పంచి వెంకటరమణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

సాగునీటి సంఘం అధ్యక్షుడికి సన్మానం

నల్లచెరువు :మండలంలోకి కె.పూలకుంట సాగునీటి సంఘం అధ్యక్షులు మిద్ద ఆదెప్పను గురువారం సన్మానించారు. వడ్డెరసంఘం మండల అధ్యక్షులు దేరంగుల తిరుపాల్ ఆధ్వర్యంలో ఆదెప్పతో పాటు పంతుల చెరువు నీటి సంఘ సభ్యులు రామచంద్ర, వెంకటరమణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మల్లేపల్లి ఉత్తన్న, నియోజకవర్గ అధ్యక్షులు కుంచపు గంగరాజు, జెర్రీ పెట్టి శంకర్, గుడ్డు వెలగల రామానుజులు, వేమయ్య, సీనియర్ నాయకులు ఆనంద్, డాక్టర్ శంకర్, పల్లపు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

చిలమత్తూరు : మండల కేంద్రంలోని ఎంపిపి స్కూల్, కాపు చన్నంపల్లి గ్రామం పాఠశాలలో విద్యార్థులకు గురువారం నోటుపుస్తకాలు, పెన్నులు అందజేశారు. అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మినారాయణ జన్మదిన వేడుకల సందర్భంగా టిడిపి నాయకులు, వాల్మీకి సంఘం నాయకులు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు బ్రెడ్ బిస్కెట్ స్వీట్లు పంపిణీ చేశారు. బస్టాండ్ ఆవరణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎన్టీఆర్ టిడిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, ఉపేంద్ర, మురళి, టిడిపి కార్యకర్తలు, వాల్మీకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

సహచర పూర్వ విద్యార్థికి తోటి విద్యార్థులు ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005-06లో పదవ తరగతి చదివిన పగడాలవారిపల్లి కొమిరి అక్కులప్ప ఆరోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో రూ 11,500 నగదును గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రమేష్,రవి పాల్గొన్నారు.

ఖాద్రీశుడిని దర్శించుకున్న కర్నాటక మాజీ స్పీకర్

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలోని లక్ష్మీనరసింహ స్వామిని కర్నాటక మాజీ స్పీకర్ రమేష్ కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హరి ప్రసాద్, భాస్కర్ రాయల్ , చిలమత్తూరు మోహన్ గాంధీ, ఖాదర్ వలి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా సమస్యలపై ఎంపీకి వినతి

సోమందేపల్లి : మండల పరిధిలోని రంగేపల్లి గ్రామానికి చెందిన జన సంరక్షణ సేవా సమితి సత్యసాయి జిల్లా అధ్యక్షులు నరసింహులు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను గురువారం ఆయన నివాసంలో కలిశారు. అనంతరం ఉమ్మడి జిల్లా సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ అనంతపురం ఉమ్మడి జిల్లాలో వ్యవసాయం తర్వాత చేనేతలు అధికంగా ఉన్నారని వారి సమస్యల పైన పార్లమెంటులో తన వాణిని వినిపించాలని ఎంపీని కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జన సంరక్షణ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

హిందూ,ముస్లిం సోదర దినోత్సవం

హిందూపురం : హిందూపురం పట్టణంలోని రహమత్ పురం లో ఇఖ్రా ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలలో హిందూ - ముస్లిం సోదర దినోత్సవాన్ని అఖిల భారత ఫ్రీడం ఫైటర్ షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్, సూఫీ సత్పురుషుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆఖీబ్ టిప్పు, షాకిరా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు హిందూ, ముస్లిం సోదరభావం మత సామరస్యం పరమత సహనం పై ప్రసంగాల పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రసంగానికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు డాక్టర్ అయేషా, డాక్టర్ అఫ్తాబ్, న్యాయవాది నవేరా రెహ్మాన్, చేనేత కార్మిక నాయకులు, అన్నదాత ఏసీ. నాగరాజు, చైతన్య గంగిరెడ్డి, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, మౌలానా ఇస్మాయిల్, అల్ అమీన్ ప్రధానోపాధ్యాయులు రియాజ్, ఉబేదుల్లా, హుసేన్, ఆడిటర్ జబీ, బ్రాహ్మణ సంఘం మురళీ దేశాయ్.మైనార్టీ నాయకుడు జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రైల్వే భద్రత, రైల్వే ప్రయాణికుల సురక్షిత ప్రయాణం పట్ల ప్రతి ఒక్క అధికారి ప్రత్యేక దృష్టి సారించాలని ప్రిన్సిపల్ రైల్వే సేఫ్టీ అధికారి కె. వెంకట రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం ధర్మవరం రైల్వే స్టేషన్, వివిధ విభాగాల కార్యాలయాలను తనిఖీ చేశారు. అదేవిధంగా ధర్మవరం రైల్వే స్టేషన్ సేఫ్టీ ఆడిట్‌ను తనిఖీ చేశారు. యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైను, మెడికల్ రిలీఫ్ ట్రైను పరిశీలించారు. అనంతరం గొల్లపల్లి రైల్వే గేటును తనిఖీ చేసి గేట్ మెన్‌కు సూచనలను చేశారు. ధర్మవరం రైల్వే స్టేషన్ పరిధిలో జీరో యాక్సిడెంట్లు ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంతకలుల ఎడిఆర్ఎం సుధాకర్, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్రన్, స్టేషన్ మాస్టర్ నరసింహనాయుడు, ఆర్‌పిఎఫ్ సిఐ బోయ కుమార్, రైల్వే డివిజన్లోని అన్ని విభాగాల సూపర్వైజర్లు, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలు సరికాదు

పెనుకొండ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పట్ల కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తక్షణం విరమించుకొని క్షమాపణ చెప్పాలని బహుజన చైతన్య వేదిక డిమాండ్ చేసింది.ఈ మేరకు ఆ వేదిక నాయకులు గురువారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కూడలిలో మానవహారం ఏర్పడి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ, కెవిపిఎస్ గంగాధర్, బాబు ప్రసాద్, రాము, రవికుమార్, రామాంజినప్ప, నరసింహులు, కొళ్లప్ప, గంగాధర్, చిన్న, మారుతి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి-హిందూపురం

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ పాత్రికేయులు మల్లికార్జున ప్రసాద్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే కార్యాలయం పేర్కొంది. ఇందులో భాగంగా గురువారం రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రామాంజనేయులు అందజేశారు. మల్లిఖార్జున విషయాన్ని స్థానిక జర్నలిస్టులు హిందూపురం ఎమ్మెల్యే కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు కు తెలపడంతో ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ తరపున ఆ కుటుంబానికి రూ.10వేలను అందజేశారు. భవిష్యత్తులో మల్లికార్జు ప్రసాద్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు అంజిన మూర్తి ప్రెస్ క్లబ్ ప్రతినిధులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నగదు మొత్తాన్ని త్వరలోనే మల్లికార్జు ప్రసాద్ కుటుంబ సభ్యులకు అందజేస్తున్నట్లు ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు తెలిపారు.

రెవెన్యూ సదస్సు

చిలమత్తూరు : మండలంలోని సోమగట్ట పంచాయతీ కేంద్రంలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు భూ సంబంధిత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యూనస్ బాబు, సర్వేయర్ కోదండపాణి, సీనియర్ అసిస్టెంట్ నేలకోటప్ప, వీఆర్వో రామాంజి, టిడిపి నాయకులు తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : మండలంలోని వెంగళమ్మ చెరువు పంచాయతీలో రెవిన్యూ అధికారులు గురువారం రెవెన్యూసదస్సును నిర్వహించారు. తహశీల్దార్ అనుపమ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఎతి కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన పోలీసు క్రీడా పోటీలు



విజేత జట్టుతో ఎస్పీ, ఎఎస్పీ, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ పోటీలలో భాగంగా పుట్టపర్తి మైదానంలో రెండవ రోజు గురువారం పోలీస్ క్రీడల్లో వివిధ అంశాల్లో జరిగిన పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగాయి. వివిధ క్రీడల్లో జిల్లా ఎస్పీ వి.రత్న పాల్గొంటూ క్రీడాకారులను ఉత్తేజపరుస్తున్నారు. మహిళా విభాగంలో జరుగుతున్న టెన్నికాట్ ఆటలో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. మహిళా పోలీసులతో కలిసి కొద్దిసేపు ఈ టెన్నికాట్ క్రీడను ఆడుతూ క్రీడాకారులను ఉత్తేజపరిచారు. వాలీబాల్ ఫైనల్ పోటీల్లో ధర్మవరం సబ్ డివిజన్ జట్టు విజేతగా నిలవగా, రన్నర్స్ గా ఆల్ వింగ్స్ జట్టు నిలిచింది. అదేవిధంగా కబడ్డీ ఫైనల్ పోటీల్లో ధర్మవరం సబ్ డివిజన్ , జిల్లా ఆర్మ్ రిజర్వుడు జట్ల మధ్య జరిగిన పోటీల్లో జిల్లా డి ఆర్ ఏ ఆర్మ్ రిజర్వుడు జట్టు విన్నర్స్‌గా నిలిచింది. పోలీసు ఉద్యోగులకు మానసిక ఒత్తిడిని తగ్గించి వారిలో క్రీడ స్ఫూర్తిని కల్పించేందుకు స్థానిక పరేడ్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పోలీసు స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌లో జిల్లా పోలీసు శాఖలో పని చేస్తున్న ధర్మవరం ,హిందూపురం, కదిరి, పుట్టపర్తి , పెనుగొండ సబ్ డివిజన్లు, ఆర్మడ్ రిజర్వు విభాగాలకు చెందిన పోలీసు జట్లు ఉత్సాహభరితంగా పాల్గొన్నాయి. ఈ క్రీడలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఆర్ఐలు, వలి, మహేష్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్, పీడీలు రామకృష్ణ, వెంకటేష్, ఆర్ ఎస్ఐలు వీరన్న, ప్రదీప్ సింగ్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన విద్యార్థుల కళానైపుణ్యం

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రంలోని విశ్వదీప్తి విద్యార్థుల కళా నైపుణ్యం పలువురిని ఆకర్షించింది. పేపర్ వ్యర్థ పదార్థాలను సేకరించి వాటి ద్వారా ఇంట్లో గృహ పరికరాలుగా ఉంచుకొనే వస్తువులుగా తయారుచేసి పాఠశాలలో ఆవిష్కరించారు. వ్యర్థ పదార్థాలతో అబ్బురపరిచే వస్తువులను తయారు చేయడాన్ని అభినందించారు. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని విద్యార్థి దశ నుండే వెలికి తీసి మరింత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రవికుమార్ వెల్లడించారు.



ప్రతిభా విద్యార్థులు

సంక్రాంతికి ఉమ్మడి జిల్లా నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

సంక్రాంతి పండుగకుఉమ్మడి జిల్లాల నుంచి 140 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా ఆర్టీసీ మధుసూదన్ పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో జిల్లాలోని డిపో మేనేజర్లు, సూపర్వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే క్రిస్మస్, సంక్రాంతి పర్వదినాలకు హైదరాబాదు, తిరుపతి, విజయవాడ తదితర నగరాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. జనవరి నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఈ సర్వీసులు నడుస్తాయన్నారు. ఈ బస్సులలో మామూలు ఛార్జీలే ఉంటాయన్నారు. ప్రయాణికులు ముందుగానే రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. అలాగే కార్గో డోర్ డెలివరీ మాస ఉత్సవం క్యాంపియన్ ఈనెల 20 నుంచి జనవరి 19 వరకు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా ప్రతి డిపోలోని కార్గో సెంటర్ల ద్వారా డోర్ డెలివరీ సౌకర్యం వినియోగించుకోవాలన్నారు. ఈ మాస ఉత్సవంలో కార్గో అందించే సేవలను ఆర్టీసీ అధికారులు ప్రజలకు వివరించాలన్నారు. క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు పురస్కరించుకొని తమ బంధువులు స్నేహితులకు కార్గో ద్వారా డోర్ డెలివరీని ఉపయోగించుకోవచ్చని అన్నారు. ఆర్టీసీ సిబ్బంది అంకితభావంతో పనిచేసి సత్యసాయి జిల్లాను ఆదాయంలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలోకి తేవడానికి కృషి చేయాలన్నారు.

పిఎబిఆర్ కుడికాలువ ద్వారా చెరువులకు నీరు

ప్రజాశక్తి - తాడిమర్రి

పిఎబిఆర్ కుడికాలువ ద్వారా చెరువులకు నీటిని విడుదల చేస్తామని హెచ్ఎల్‌సి ఎస్ఇ రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం పిఎబిఆర్ కుడి కాలువను సందర్శించి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం చివరి చెరువు నుండి నీటిని నింపేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే మొదటగా ఎం అగ్రహారం చెరువుకు నీరు విడుదల చేయడం జరిగిందని అన్నారు. ప్రతి చెరువుకు నీటిని వదిలేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఏ ప్రాంతంలోనైనా కాలువలకు గండి కొట్టి నీరు తరలించేందుకు ప్రయత్నిస్తే తగిన చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ అబ్దుల్ సమీ, డిఇఇ రెడ్డప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా సిబ్బంది సామర్థ్యం పెంపుపై శిక్షణ

ప్రజాశక్తి - మడకశిర

మడకశిర వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల రైతు సేవా కేంద్ర సిబ్బందికి సామర్థ్యం పెంపుపై శిక్షణ కార్యక్రమాన్నిగురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి వైవి సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఆర్ఎస్‌కె సిబ్బంది తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉండి తగిన సలహాలు సూచనలు చేయాలని కోరారు. రాగి పంట విస్తీర్ణాన్ని పెంచి అధిక దిగుబడి సాధించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సిబ్బంది సూచించారు. ఎడిఎ సనావుల్లా మాట్లాడుతూ వేరుశనగ, మొక్కజొన్న, రాగి, వారి, కంది పంటలలో సమగ్ర ఎరువుల యాజమాన్యం,గురించి వివరించారు. సూక్ష్మనీటిపారుదల (ఏపీఎంఐపి) పీడీ సుదర్శన్ మాట్లాడుతూ బిందు సేద్యం పరికరాలు 30 వేల హెక్టార్లు సత్యసాయి జిల్లాకు మంజూరయ్యాయనీటిని అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు క్రిష్ణమీనన్, సహాయ పట్టు పరిశ్రమ సంచాలకులు (సిరికల్చర్) అధికారి రాజు, ఐదు మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి - రొద్దం

గ్రామాల సుస్థిర అభివృద్ధిపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు గురువారం ముగిసాయి. ఎంపీడీవో కార్యాలయంలో నాలుగు రోజులుగా ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ముగింపు రోజున మండలంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు, హార్టికల్చర్ అసిస్టెంట్లకు, మహిళా పోలీసులకు, ఏఎన్ఎంలకు, శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్ కుమార్, ఈవోఆర్డీ గోవిందప్ప, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ, ఆర్డబ్ల్యుఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ సూర్యకుమార్, వెలుగు ఎపిఎం విశ్వనాథ్, మెడికల్ హెల్త్ సూపర్వైజర్ గిరినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను సాధించుకుందాం

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఒపిఎస్ సాధించేవరకు పోరాటం చేస్తామని ఏపీ సిపి ఎస్ఇకార్యవర్గ సభ్యులు గురువారం పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వ పిలుపుమేరకు ఏపీ సి పి ఎస్ సి ఎ కార్యవర్గ సభ్యులు ఈనెల 16వ తేదీ నుండి 21 వరకు ఆవిర్భావ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మండలంలోని పలు పాఠశాలలో వారోత్సవాలు నిర్వహించారుజగురువారం మండల పరిధిలోని గుడిపల్లి సోమందేపల్లి జూలుకుంట మండ్లి, ఈదుల బలాపురం పాఠశాలలో ఏపీ సిపిఎస్ఇఎ ఆవిర్భావ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా నాయకులు రంగేష్ కుమార్ ,చంద్ర శేఖర్, మండల ప్రధాన కార్యదర్శి సజ్జరాయప్ప, ట్రెజరర్ గణేష్ కుమార్, మోహన్ బాబు,రమేష్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై అవగాహన

ప్రజాశక్తి - తాడిమర్రి

ఉపాధి పనులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఉపాధి సిబ్బంది కోరారు. మండల పరిధిలోని చిల్ల కొండయ్య పల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులపై గురువారం అవగాహన కల్పించారు. ప్రతి కూలి సమర్థవంతంగా పనులు చేయాలని పనికి తగ్గ వేతనం అందుతుందని టెక్నికల్ అసిస్టెంట్ వి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రామారావు కూలీలకు తెలిపారు. అలాగే ఉపాధి హామీ పనులలో భాగంగా ప్రతి ఒక్క ఇంటి వద్ద ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని ఈ ఇంకుడు గుంతలు ఉపయోగించుకోవడం వల్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని చెప్పారు.

మానవతా విలువల పెంపునకు కృషి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మానవతా విలువలు పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తారక్ చేయూత ట్రస్ట్ అధ్యక్షులు రామాంజి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారక్ చేయూత ట్రస్ట్ గత కొన్ని సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలను చేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగానే ధర్మవరం పట్టణంలోని శ్రీ లలిత నాట్య కళానికేతన్ నాట్య గురువులు బాబు బాలాజీ కుమార్తె పుట్టినరోజు సందర్భంగా తారక్ చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణములోని రాజేంద్రనగర్లో గల అనాధాశ్రమంలో వృద్ధులకు అన్నదానముతో పాటు దుప్పట్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. దాతలు ముందుకు వస్తే మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాన్స్ మాస్టర్ బాబు బాలాజీ, హర్ష శ్రీ, రామ లాలిత్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు రస్తా సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రంలోని హిందూ శ్మశాన వాటికకు రస్తా సౌకర్యం కల్పించాలని టిడిపి నాయకులు కోరారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు దొనకొండ, ఆనంద్, ఎస్ అక్రంబాషా తదితరులు మాట్లాడుతూ శ్మశానవాటికకు రస్తా సౌకర్యం ఏర్పాటు చేయాలని పలుమార్లు ఆర్డీవో, తహశీల్దార్, ఎంపిడిఒలకు వినతి పత్రాలు అందజేసినా ప్రయోజనం కనిపించలేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని శ్మశాన వాటికకు రస్తా సౌకర్యం కల్పించాలని వారు కోరారు.